# అభూతం

'అ మ రేం ద్ర'

కథకుడు శూన్యహృదయంతో గత అనుభూతుల తరుశాఖల నీడలలో నిద్రపోతున్నాడు. నిరాశతో విసిరివేసిన వేణువు దూరంగా పడివుంది. ఇంతలో ఏదో పక్షి ఎగిరివచ్చినట్లు రెక్కలరొద వినిపించిది. దూరంగా పడివున్న మురళిని తన చేతుల్లోకి తీసుకుని ఎగిరివచ్చి కథకుడి చెవిదగ్గర ఊదటం ఆరంభించింది. ఉలికిపడిలేచాడు 'ఎవరునువ్వు?' అంటూ. కిలకిల నవ్వుతూ "లే, తెలియదూ? రా నాతోరా 'అని అతని చెయ్యి పుచ్చుకుని లాగుతూ వేణువు గిరిగిర త్రిప్పుతూ విలాసంగా పరిగెత్తింది. కథకుడికి ఆమె ఎవరో తెలిసింది కాని ఇదివరకేన్నోసార్లు మోసపోయాడు. ఏ నట్టనడి ఎడారిలోనో విడిచి పారిపోతుందని భయపడుతూ ప్రశ్నించాడు 'ఎక్కడికి?' సీతాకోకచిలుక రెక్కల్లాగావున్న రెక్కలాడిస్తూ 'పిరికిపందా! భయపడుతావేం?' అన్నది. మారుమాటాడకుండాకథకుడు నడిచి వెళ్తున్నాడు. ఎక్కడికోతెలియటంలేదు అది సూర్యోదయమో అస్తమయమో అర్థంకాలేదు! కిలకిల లాడుతూ పక్షులు తుర్రున ఎగిరిపోతున్నయ్. గాలి ఈలలువేస్తూ గంతులేస్తోంది చెట్ల మీదా, కొండల మీదా....

ఎంతసేపు నడిచాడో, ఎంత దూరం నడిచాడో....

తన కళ్లని తానే నమ్మలేక పోయాడు. తనమీద ఎవరో మత్తు జల్లినట్లుగా వుంది. అంతా మసకగా వుంది. మితిలేని కౌతుకంతో చూస్తున్నాడు. ఏమిటి ఆదృశ్యం? ఏమి ప్రపంచమో ఇది! ఇదికలా? నిజమా? అంతటా కోలాహలం. అన్ని దిశల నుంచీ శంఖారవాలు వినిపిస్తున్నయ్ చెవులు గింగురు మంటూ. చకితుడై మార్గదర్శికను ప్రశ్నించాడు 'ఏమిటిదంతా?' 'చష్. ఊరుకో' కథకుడు మెదలకుండా అన్నివైపులా చూస్తూనడుస్తున్నాడు. నాటి ఆనందంతో నక్షత్రాలనే తెచ్చి తోరణాలు కట్టినట్లుంది! ఢంకా మోగింది. వెంటనే ఉరిమినట్లుగా కంఠధ్వని వినిపించింది. 'యుద్ధం ఆగి పోయింది. ఈ రెండు దేశాలకీ సంధి' ఏమివిన్నదీ నమ్మలేక పోయాడు కథకుడు. ఏమిటీ గగనకుసుమం చేతి కందటం? ధ్వనివచ్చిన వైపుకి గబగబా పరిగెత్తాడు. ఆసమూహాన్ని చూసేసరికి కళ్లు గిర్రున తిరిగినయ్. మధ్య ఉన్నతవేదికమీద ఇద్దరు చక్రవర్తులూ చేతులో కిరీటాలు పుచ్చుకుని ఏక కంఠంతో ఉపన్యసించటం ఆరంభించారు: 'సృష్టి మొదటి నుంచి ఇప్పటి వరకూ మనం శాంతిని శాశ్వతంగా పొందలేక పోయాం. మన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరులాగా వ్యర్థమై పోయినయ్. ఆలోచించగా మాకొకటి తోస్తోంది. పురుషప్రవృత్తే అంతకీ విరుద్ధమని, పురుషుల పాలన పరుషంగా వుండి తీరుతుందని!

మార్పు తప్పదు. ఈ విషయంలో సందేహమేమీ లేదు. ఎల్లా ఆమార్పు తేవాలని ఆలోచించి చివరికి ఈ నిశ్చయాని కొచ్చాం జనులందరితోపాటు కథకుడూ చెవులు నిక్క పొడుచుకుని విన్నాడు. "ఈరోజు నుంచీ విక్రమపుర సక్రమపుర ప్రజలు శాశ్వతంగా శాంతితో జీవించదలచితే ఒక్కటే తరణోపాయమున్నది. పరిపాలనలో పురుషులు జోక్యం వదలు కొని స్త్రీలకిచ్చివేయాలి. వారు శాంతిని నెలకొల్పి మనకి దోవచూపుతారని ఆశిస్తునార'

కథకుడు ఈవింతకి స్తంభించిపోయాడు. సమూహంలో వున్న పురుషులేమీ మెదల

లేదు, కాని స్త్రీలంతా కరతాళధ్వనులు చేశారు.

* * *

క్షణంలో దృశ్యం మారిపోయింది. విక్రమపుర సింహాసనం మీద మహారాణిగారు అధిష్టించి వున్నారు. ప్రధాని మంత్రులు భటులు, గాయికలు ఆశ్వికలు, సైనికలు ఎక్కడ చూసినా స్త్రీలే. ఆ దర్బారుకి పురుషుల నందరినీ ఆహ్వానించారు. నిండు పేరోలగంలో కోలాహలంమధ్య రాణిగారు లేచి ఉపన్యసించటం ఆరంభించారు. 'ఈనాడు చరిత్రలో బంగారపు అక్షరాలతో వ్రాసుకో దగిన కాలం. ఇన్నిశతాబ్దాలనుంచీ స్త్రీలకి తమ పరిపాలనాప్రాగల్భ్యాన్నిచూపే అవకాశం లేక పోయింది. మహా రాణులు సింహాసనమెక్కినా రాజ్యతంత్రమంతా పురుషుల చేతుల్లోనే వుండేది. ఇక ముందు చూడండి మనదేశంలో శాంతి ఎప్పుడూ నాట్యం చేస్తుంది. కలలోకూడా కాఠిన్యం, ద్వేషం దారిద్ర్యం వుండవు. ఇన్ని యుగాల నుంచీ పురుషులు వేనిని స్వప్న సామ్రాజ్యాలుగా భావిస్తున్నారో వాటిని ఇక ముందు ఈనేలమీదకి తీసుకొచ్చి చూపిస్తాం. ఇక స్త్రీలు తమ అవసరమైన వినయాన్ని, అల్పత్వాన్ని విడిచివేసి తల యెత్తి సృష్టిలో తమకున్న సమత్వాన్ని స్థాపించుకోవాలి. దీనికి పురుషుల తోడ్పాటు కూడా ఎంతో అవసరం!' పురుషులంతా ఏకాగ్రంగా వినటం ఆరంభించారు.

'బాధ్యతలని ఇరువురూ సమంగా పంచుకోవాలి. పరిపాలనా భారమంతా స్త్రీ నిర్వహిస్తుంది. గృహనిర్వాహణమంతా పురుషుడు భరించాలి. అప్పుడే మన ఆదర్శాలు ఫలిస్తయ్. అప్పుడే పురుషపాలనకీ, స్త్రీ పాలనకీ ఎంత భేదముందో చూపే అవకాశం దొరుకుతుంది. పురుషులంతా ఏకగ్రీవంగా వాగ్దానంచెయ్యాలి. ఇదివరకు స్త్రీ స్థానం ఇప్పుడు తాము ఆక్రమించి సక్రమంగా నిర్వహిస్తామని" కరతాళ ధ్వనులతో ఉపన్యాసంముగిసింది. పురుషులంతా ఏకగ్రీవంగా వాగ్దానం చెయ్యటమూ, స్త్రీలంతా చప్పట్లు చరుస్తూ సంతోషాన్ని చూపటమూ, సక్రమపురంనుంచి వార్తాహారి వచ్చి అక్కడా ఇల్లాగే జరిగినవని నివేదించటమూ ఒక్కసారి జరిగినయ్. కథకుడు ఇంచుమించు మూర్ఛపోయాడు ఈ విపరీతానికి.

కథకుడు ఆదేశంలో పర్యటన మారంభించాడు వింతలు చూడాలని. ప్రొద్దునే చెఱువునుంచి బిందెలు నెత్తినెత్తుకుని చలిలో గడగడ వణుకుతూ నీళ్ళుతెస్తున్న పురుషుల్నిచూసి భయపడి పారిపోయాడు. పోతూపోతూ ఒక రోడ్లో కూరలు తరుగుతున్న పురుషుణ్నొకణ్ని చూశాడు. ఇంకో మూల మరొకడు చల్ల చేస్తున్నాడు. గబగబా నడిచాడు ఎన్నో కళ్ళు తిరిగిపోయే దృశ్యాలు చూస్తూ. స్త్రీ పోలీసుల్ని చూసి భయపడి వాళ్ల చేతులో లాఠీలేకపోవటాన్ని చూసి ఆశ్చర్యపోతూ ఒక సందులోకి తప్పుకున్నాడు. దోవనపోతుంటే ఒక ఇంట్లోంచి స్త్రీ కంఠం బిగ్గరగా వినిపించింది 'ఇంకా వంట కాలేదూ? ఆఫీసు కెళ్లాలి. ఏయ్, నీకే చెప్పేది'. కథకుడు నిలువునా నీరైపోయాడు. ఇంతలో ఎంతోమంది స్త్రీలు మోటార్ల మీద, సైకిళ్ళమీదా, గుర్రాలమీదా గుంపులు గుంపులుగా వెళ్లిపోయారు అతనికళ్ళముందు నుంచి. నడిచాడు ఇంకా ముందుకి. పసిపిల్లని కాళ్ళమీద పడుకోబెట్టుకుని తలంటిపోస్తూ కనిపించాడొక పురుషుడు. ఒకడు విస్తళ్లెత్తి వీధిలో పారేస్తున్నాడు, ఇంకోడు ఇల్లు అలుకుతున్నాడు. ఇంతలో పోలీసు స్టేషను కనిపించింది గుండె గబగబ కొట్టుకుంది. తననీ ఏ స్త్రీ పోలీసైనా ఊరికే తిరుగుతున్నందుకు పట్టుకుంటుందేమోనని భయంతో ఇంకోదోవ పట్టాడు. ఆదోవన ప్రధానిగారు వస్తున్నారని బాకా ఊదారు. కళ్ళముందునుంచి పెద్ద మోటారు బర్రున పరుగెత్తింది. పార్కుదగ్గర రేడియోవింటూ స్త్రీలే కనిపించారు. క్లబ్బులోకి తొంగి చూశాడు——కొందరు పేక ఆడుకుంటున్నారు, కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు, కొందరు టెన్నిస్ ఆడుతున్నారు. పోగాపోగా కథకుడి కొక పురుషుడు కనిపించాడు. కథకుడు 'ఆగు. ఒక్కమాట.' అని పిలిచాడు. కాని పురుషుడు పిల్లణ్ని చంకన పెట్టుకుని 'అమ్మో వేళయిపోయింది. వంటచెయ్యాలి; ఇంటికి వచ్చేవేళయింది" అని దూసుకుని పరిగెత్తాడు.

మార్గదర్శిక కథకుణ్ని ఇంకెకెక్కడికో తీసికెళ్ళింది. ఎక్కడా దొంగతనాలూ, దెబ్బలాటలూ, ఖూనీలు కనిపించనేలేదు. మనస్సులో ఇదీ బాగానే వుందనుకున్నాడు కాని తాను మాత్రం అక్కడ చిక్కుపడితే ఇబ్బందిపడతానని భయపడి మార్గదర్శికతో చెబితే ఆమె ఒక్క నవ్వునవ్వి అతని చెవిలో ఏదో రహస్యం చెప్పింది.

మర్నాడు కథకుడు సక్రమపురానికి బయలుదేరాడు. అక్కడా ఇవే మాదిరి వింతలెన్నోచూసి, ఆశ్చర్యపడి, భయపడి చివరికి మానవజాతికి ఉజ్జ్వలభవితవ్యం నిర్మితమౌతున్నదనీ, ప్రపంచంలో లాలిత్యం ప్రవర్ధిల్లుతున్నదనీ ఉప్పొంగిపోయాడు. ప్రధానామాత్యురాలిని సందర్శించటానికి

వెళ్ళాడు కథకుడు. కార్యకలాపంలో నిమగ్నమైన ఆమె ప్రశ్నించింది కొంచెం తొందరగా 'దేనికి వచ్చావమ్మా?' అని.

'ఏదైనా ఉద్యోగమిప్పిస్తారని?' 'ఏం పని చెయ్యగలవు?'

'సహజంగా కవయిత్రిని, కథకురాలిని. అయినా ఏదైనా సరేనండి'

'అయితే ఆస్థానకవయిత్రినిగా నియమించాను నిన్ను'

'నమస్కారాలు' అని శలవు తీసుకున్నది కథకురాలు—అంటే ఆడవేషం వేసుకున్న కథకుడు!

ప్రతిదర్బారూ కవయిత్రి కవనపఠనంతో ఆరంభమయేది. ఆమె 'పుష్పబాణం' అనే కావ్యాన్ని మహారాణిగారు మెచ్చుకుని ఆమెకి ముత్యాలహారం బహుమతిచేయటమేకాక తాము దాన్ని ప్రతిక్షణమూ పారాయణ చేస్తూవుండేవారు: కాలం కలలాగా గడిచిపోతోంది. ఇల్లావుండగా ఒకనాడొక అత్యద్భుతమైన చీరె మహారాణిగారి కెవరో బహూకరించారు. ఆకాశం రంగూ, నక్షత్రాలూ, ఆ చీరెను పది మడతలు, వేసి కట్టుకుని మహారాణిగారు రజనీదేవిలాగా భాసించింది. ఆ చీరెమీద ఆస్థానకవయిత్రి 'అంబర అంబరం' అనే కావ్యాన్ని రచించి మహారాణికి అంకితమిచ్చింది. సక్రమపురంలో ఏమూల విన్నా ఆచీరె ప్రశంసే, తమకౌతుకాన్ని ఆపుకోలేని పురుషులు స్త్రీల ఆజ్ఞ తీసుకుని, కొంచెం పనితీరిక చేసుకునివచ్చి చూసి వెళ్లారు. రాణికూడా తన అదృష్టానికి గర్వించటంఆరంభించింది. ఆపట్టుచీరె కీర్తిఆనోటా ఆనోటా పాకి విక్రమపుర మహారాణిగారి చెవినిపడింది, చూడకపోయినా ఆచీరెమాట వినటంతోనే ఒకవిధమైన వ్యామోహం కలిగింది! వెంటనే ఆజ్ఞాపత్రమిచ్చి తనమంత్రిని సక్రమపురమహారాణి దగ్గరికి పంపింది. సక్రమపుర సామ్రాజ్ఞి ఇల్లా ప్రత్యుత్తరమిచ్చింది: 'సోదరీ, విక్రమపుర మహారాజ్ఞీ! తాము ఈ అద్భుతమైన చీరె నొకపరి పంపమని కోరియున్నారు. నావాంఛితమేమన, తామిట కొకపరి దయచేసి మాదేశము బావనమొనర్చి చీరెనుగూడ విలోకించినచో బాగుండునని" ఈ లేఖను చూసిన క్షణమే విక్రమపురమహారాణి సక్రమపుర మహారాణి కడకు ప్రయాణమై వెడలింది. అపరిమితానందంతో స్వాగత మిచ్చింది సక్రమపుర సామ్రాజ్ఞి. సంరంభమంతా అణగినాక విక్రమపుర మహారాణిని ఆస్థానానికి కొనిపోయి, ఉచితసత్కారాలుచేసి తన అద్భుతమైన చీరెను చూపించింది. విక్రమపుర మహారాణి నిశ్చేష్టురాలైంది, ఆమె కళ్లలో కోరిక మెరిసింది. ఎల్లాగయినా సరే.... వెంటనే చమత్కారంగా 'సక్రమపుర మహారాణీ! మీ అతిథి కోరిన సత్కారం చెయ్యగలరా?'

'ఆఁ' అంది సక్రమపుర సామ్రాజ్ఞి దర్పంగా.

'అంతే, మహారాణీ, ఆచీరె!'

సంభాషణ ఇంతటితో ఆగిపోయింది. విక్రమపురమహారాణి ఆగ్రహంతో తిరిగి వెళ్ళిపోయింది. జగత్తులో జన్మించటం సార్థకం చేసుకోవాలంటే ఆ చీరెకట్టుకుని తీరాలని నిశ్చయించుకుంది 'ఆచీరె ఇచ్చినాసరే, అటువంటి దింకోటి నేయించి ఇచ్చినాసరే' అని అల్టిమేటం పంపింది. సక్రమపురమహారాణి 'ఆనేసిన వాళ్ళిప్పుడీ లోకంలోలేరు. మరి ఈచీరె ఎల్లా ఇచ్చేది?' అని ప్రత్యుత్తరం పంపింది. విక్రమపురమహారాణికి విపరీతమైన ఆగ్రహం కలిగింది. తన స్త్రీత్వం ఆచీరెలేందే సార్థకమెల్లా ఔతుంది? ఏమైనా సరే....ఎల్లాగైనాసరే....

యుద్ధదుందుభి మోగింది. స్త్రీ సైనికలు కలియబడబోతున్నారు. ఇదంతావిని పురుషులో కోపంతో వంటఇళ్లు విడిచి పరిగెత్తుకొచ్చారు. ఇంతలోనే శాంతిశంఖం దిక్కులు పిక్కటిల్లేట్లు మోగింది. ఈ సందడిలో అంతఃపురస్త్రీలలో తిరగలేక బాధపడుతూ సమయంకోసం నిరీక్షిస్తున్న కథకురాలు అమాంతంగా పరిగెత్తి కథకుడై మేలుకున్నాడు. ఇదే మొదటి యుద్ధమూ, చివరిది కూడా ఇదే అనీ. సంధిషరతు ఏమంటే ఆ అద్భుతమైన చీరెని మధ్యకిచింపి ఇద్దరు రాణులూ చెరొకసగమూ తీసుకోటమనీ, ఉరుముల్లాగా చాటించారు.

ఇందాకటినుంచీ కథకుణ్ని ముందుకు లాక్కుపోతున్న రెక్కలమనిషి చేతులో వున్న మురళి అమాంతం కథకుడిమీదికి విసిరి మాయమైపోయింది.

